సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 1 । నవంబర్ । 2023



ఉద్దండుల అడ్డా

చేవెళ్ల సెగ్మెంట్ రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. ఇక్కడ గెలిచిన అభ్యర్థులెందరో రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పారు. 10లో▸



బీఆర్ఎస్‌ను గద్దె దింపుదాం

అవినీతి బీఆర్ఎస్‌ను గద్దె దింపుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. 10లో▸

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

చేవెళ్ల: ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీచైతన్య కళాశాలలో మంగళవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు.

న్యూస్‌రీల్

సీవిజిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ భారతి హోళికేరి



ఇబ్రహీంపట్నం రూరల్: ఓటర్లను ప్రలోభాలు పెట్టినా.. భయభ్రాంతులకు గురిచేసినా సీవిజిల్ యాప్ ద్వారా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తారని.. యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భారతి హోళికేరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న వారెవరైనా సీవిజిల్ యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సమస్యను సంక్షిప్తంగా టైప్ చేసి పంపించాల్సి ఉంటుందని తెలిపారు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరగాలంటే ప్రజలు తమ కళ్లముందు కనిపిస్తున్న అన్యాయాన్ని వెంటనే ఈ యాప్ ద్వారా తమ దృష్టికి తేవాలన్నారు. ఇంగ్లిష్‌లో గానీ తెలుగులో గానీ సమస్యను పంపవచ్చన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా దివ్యాంగుల కోసం సాక్ష్యం అనే యాప్ రూపొందించిందని, ఈ యాప్ ద్వారా వివిధ రకాలైన సేవలు పొందొచ్చన్నారు. కొత్త ఓటరు నమోదు, ఓటరు బదిలీ, తప్పుల సవరణ, తీసివేత, ఆధార్‌తో అనుసంధానం, వీల్‌చైర్ కోసం అభ్యర్థన, దివ్యాంగులకు ఓటర్ కేంద్రం వరకు తిరిగి పంపేందుకు అభ్యర్థన, సహాయకులకు అభ్యర్థన, ఎలక్ట్రోల్ రోల్ నందు పేరుని గుర్తించడం, పోలింగ్ కేంద్రం ఎక్కడ అనేది తెలుసుకొవచ్చని వివరించారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొవచ్చని సూచించారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన



స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఇండోర్ మినీ స్టేడియంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంను మంగళవారం అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం పరిసరాల భద్రతపై ఆర్డీఓ వెంకటమాధవరావు, తహసీల్దార్ పార్థసారథితో చర్చించారు. స్ట్రాంగ్ రూం భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, ఎంత మంది భద్రతా సిబ్బందిని నియమించారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంల భద్రతపై నిర్లక్ష్యం వహించరాదని, స్ట్రాంగ్ రూం భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ, స్ట్రాంగ్ రూం భద్రతపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పోలీసుల తనిఖీల్లో రూ.4.5లక్షలు స్వాధీనం

చేవెళ్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్వహిస్తున్న పోలీస్ చెక్‌పోస్టులో రూ.4.5 లక్షల నగదు పట్టుబడినట్లు చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. వివరాలివీ.. మండలంలోని అంతారం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఓ వ్యక్తి తన కారులో రూ.4.5 లక్షల నగదుతో వెళ్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నారు.

పట్టం ఎవరికో..?





సబితారెడ్డి



కేఎల్ఆర్



అందెల

చేవెళ్ల టు మహేశ్వరం

- బరిలో సబితారెడ్డి, కేఎల్ఆర్
- ఇద్దరి మధ్య రెండు దశాబ్దాల వైరం
- గెలుపు తలుపు తట్టేదెవరినో..
- బీజేపీకి కలిసివచ్చేనా..?
- ఆసక్తికరంగా మహేశ్వరం రాజకీయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వారిద్దరూ రాజకీయ ప్రత్యర్థులు. గతంలో ఒకే పార్టీలో కొనసాగినా.. రాజకీయవైరం మాత్రం కొనసాగుతూనే ఉంది. తాజాగా మళ్లీ వారిద్దరే పోటీ పడబోతున్నారు. గతంలో ఇందుకు చేవెళ్ల నియోజకవర్గం వేదికైతే.. ఈసారి మహేశ్వరం కాబోతోంది. 23 ఏళ్ల రాజకీయ వైరంతో పాటు ఆర్థిక బలం, అంగబలం ఉన్న ఉద్దండులిద్దరూ మళ్లీ పోటీ పడుతుండటంతో ప్రస్తుతం అందరి దృష్టి మహేశ్వరం నియోజకవర్గంపై పడింది.

అప్పటి నుంచి రాజకీయ వైరం

పటోళ్ల ఇంద్రారెడ్డి 1983లో లోక్‌దళ్ శక్తి పార్టీ నుంచి తొలిసారిగా చేవెళ్ల నుంచి పోటీ చేశారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి కె.లక్ష్మారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత టీడీపీలో చేరి 1985లో అదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇలా వరుసగా 1989, 1994లో టీడీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఇంద్రారెడ్డి పోటీ చేయగా, టీడీపీ నుంచి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్)పోటీ చేశారు. ఇంద్రారెడ్డిపై ఆయన ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. ఇంద్రారెడ్డి అకాల మరణంతో 2000 సంవత్సరంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన స్థానంలో ఆయన సతీమణి సబితారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేయగా, టీడీపీ నుంచి కేఎల్ఆర్ బరిలోకి దిగారు. అలా అప్పటి నుంచి వారి మధ్య రాజకీయ వైరం కొనసాగుతూనే ఉంది.

చేవెళ్ల నుంచి చెరో దిక్కుకు..

2004లో కేఎల్ఆర్ పోటీకి దూరంగా ఉన్నారు. ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉండటంతో టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చేవెళ్ల ఎస్సీకి రిజర్వ్ కావడంతో వీరిద్దరూ ఆ నియోజకవర్గాన్ని వీడాల్సి వచ్చింది. సబితారెడ్డి మహేశ్వరం నుంచి పోటీ చేయగా, కేఎల్ఆర్ మేడ్చల్ నుంచి బరిలోకి దిగారు. అలా ఇద్దరూ చెరో నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఇద్దరూ విజయం సాధించారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2014లో సబిత పోటీకి దూరంగా ఉన్నారు. కేఎల్ఆర్ మాత్రం అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటి వరకు ఇద్దరూ ఒకే పార్టీలో కొనసాగినా.. వారి మధ్య నెలకొన్న రాజకీయ వైరం మాత్రం అలాగే కొనసాగుతూ వస్తోంది.

అందరి దృష్టి మహేశ్వరంపైనే..

2018లో సబిత మహేశ్వరం నియోజకవర్గం నుంచే కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించింది. ఆ తర్వాత ఆమె కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. విద్యాశాఖ మంత్రిగా కేబినెట్‌లో కొలువుదీరారు. కేఎల్ఆర్ అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. నిజానికి కేఎల్ఆర్ ఈ ఎన్నికల్లో తాండూరు నుంచి పోటీ చేయాలని భావించారు. అక్కడి నుంచి డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డికి ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు గత ఎన్నికల్లో పార్టీ గుర్తుపై గెలుపొంది, ఆ తర్వాత ఇతర పార్టీల్లో చేరిన వారికి ఈ ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని అధిష్టానం భావించింది. సబితకు అన్ని రకాలుగా పోటీ ఇచ్చే కేఎల్ఆర్‌ను మహేశ్వరం నుంచి పోటీకి దింపాలని నిర్ణయించి, ఆ మేరకు టికెట్ ఖరారు చేసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గుర్తుపై గెలుపొందిన సబిత ప్రస్తుతం కారు గుర్తుపై పోటీ చేస్తుండగా, కేఎల్ఆర్ కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇలా ఏళ్ల తరబడి రాజకీయ వైరం కలిగిన ఇద్దరూ నేతలు మహేశ్వరం వేదిగా మరోసారి తలపడనుండటం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

బీజేపీ ప్రచారాస్త్రాలు

బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరూ స్థానికేతరులే. వారిద్దరూ ఒకే ప్రాంతానికి, ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. వీరిద్దరి మధ్య నెలకొన్న వైరం బీజేపీ అభ్యర్థికి కలిసి వచ్చే అవకాశం లేకపోలేదు. ఇక్కడి నుంచి ఆ పార్టీ అందెల శ్రీరాములును బరిలోకి దింపింది. ఆయన 2018 ఎన్నికల్లోనూ పోటీ చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయన ప్రధాని మోదీ బొమ్మ సహా స్థానికత.. బీసీ కార్డును తెరపైకి తెచ్చే అవకాశం ఉంది. రెండు ప్రధాన పార్టీలు, ప్రాంతాలు, సామాజిక వర్గాల నేతల మధ్య నెలకొన్న రాజకీయ వైరం చివరికి బీజేపీకి సానుకూలంగా మారినా ఆశ్చర్యపోనవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బీఆర్ఎస్‌కు అండగా నిలవండి



మంత్రికి కరవాలాన్ని బహూకరిస్తున్న నాయకులు

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: గొల్ల, కురుమ యాదవ సోదరుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో గొల్ల, కురుమ, యాదవ సోదరుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రాల్లో చేయనటువంటి అభివృద్ధి సీఎం కేసీఆర్ చేశారన్నారు. కుల వృత్తుల వారికి అండగా నిలబడ్డారన్నారు. కుల సంఘం కోసం రూ.5కోట్ల విలువైన 2 వేల గజాల స్థలం ఇచ్చామన్నారు. గొర్రెల కాపరులకు ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేశామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని ఆమె కోరారు. అంతకు ముందు బీరప్ప గుడి నుంచి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్, కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోతర్ల అంబయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు సరికాదు

ఏదైనా ప్రజా క్షేత్రంలో తేల్చుకోవాలి కానీ హత్యా రాజకీయాలు చేయడం సరికాదని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ ప్రభాకర్ రెడ్డిపై హత్యాయత్నాన్ని పిరికిపందల చర్యగా అభివర్ణించారు. ఈ దాడి వెనుక ప్రతిపక్షాల కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోతామని హత్యా రాజకీయాలకు ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్, బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.1.20 కోట్ల విలువైన నల్లబెల్లం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: రాందాసుపల్లి, కోహెడ గ్రామాల పరిధిలోని కోల్డ్ స్టోరేజీలపై ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇందులో సుమారు రూ.1.20 కోట్ల విలువైన 30 టన్నుల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ ఎ.చంద్రయ్య, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ ఆదేశాల మేరకు దాడులను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మంచాల మండలం చెన్నారెడ్డిగూడ వద్ద సోమవారం రాత్రి యాక్టివా వాహనంపై పది లీటర్ల గుడుంబా తరలిస్తుండగా.. ఇదేగ్రామానికి చెందిన బిక్యాను అరెస్టు చేయడంతో కోల్డ్ స్టోరేజీల బాగోతం బయటపడింది. అతన్ని విచారించగా నాటు సారా తయారీకి ఆగ్రో కోల్డ్ స్టోరేజ్‌ల నుంచి నల్లబెల్లం కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి మంగళవారం కోల్డ్ స్టోరేజ్‌లపై దాడులు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాందాసుపల్లి సమీపంలోని ఆగ్రో కోల్డ్ స్టోరేజ్, హయత్‌నగర్ ఎక్సైజ్ పరిధిలోని కోహెడ వద్ద వైష్ణవి కోల్డ్ స్టోరేజీలపై దాడులు జరిపి ఆగ్రో కోల్డ్ స్టోరేజీలో 22 టన్నులు, వైష్ణవి కోల్డ్ స్టోరేజీలో 8 టన్నుల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.కోటి 20 లక్షలు ఉంటుందని చెప్పారు. నాటుసారాతో పట్టుబడిన బిక్యాను అరెస్టు చేయగా.. కోల్డ్ స్టోరేజీలకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు టి.అరుణ్‌కుమార్, హనుమంతురావు, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్ సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, టి.లక్ష్మణ్‌గౌడ్, డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు యదయ్య, వెంకన్న, హనుమంతు, విష్ణు పాల్గొన్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న మర్రి నిరంజన్‌రెడ్డి

ఎన్నికల బరిలో ఉంటా

- కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచన చేయాలి
- ప్రజా సేవకుడికి బీఫాం ఇవ్వాలి
- అభిమానులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ
- మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఏదో ఒక రకంగా ఎన్నికల బరిలో ఉండాలని అనుకుంటున్నానని.. దీనిపై పార్టీ శ్రేణులు, అనుచరులు, అభిమానులు అభిప్రాయం చెబితే అందుకు అనుగుణంగా తన నిర్ణయం ఉంటుందని మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తన అనుచరులు, పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకే భగవంతుడు తనను పుట్టించాడేమోనని అన్నారు. రాజకీయం కుటుంబ నేపథ్యం కాకున్నా గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఎంపీపీగా పనిచేశానని తెలిపారు. ప్రస్తుతం ఆదిబట్ల కౌన్సిలర్‌గా కొనసాగుతున్నానని, తన భార్య మంచాల జెడ్పీటీసీగా పదవుల్లో ఉన్నట్లు చెప్పారు. ప్రజా క్షేత్రంలో ఓటమి ఎరుగనివాడిగా ఉన్న తనకు టికెట్ కేటాయించకపోవడం మానసిక క్షోభకు గురిచేస్తోందని బావోద్వేగానికి గురయ్యారు. ప్రజల మధ్య ఉండేది ఎవరో.. సేవ చేసేది ఎవరో గుర్తించి అధిష్టానం పునరాలోచన చేసి పార్టీ బీఫాం తనకివ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, డి.రాంరెడ్డి, హూనానాయక్, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉదయ్‌పాల్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, మూర్తి, వాజీద్, అంబేడ్కర్ సంఘం నాయకుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌పై స్పెషల్ ఫోకస్

- కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి
- నేడు రాహుల్ గాంధీ రాక
- భారీ రోడ్ షోకు పార్టీ శ్రేణుల కసరత్తు



షాద్‌నగర్: షాద్‌నగర్‌పై కాంగ్రెస్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. గతంలో పార్టీకి కంచుకోటగా ఉన్న నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ బలం పుంజుకోవడంతో డీలా పడింది. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు జెడ్పీటీసీలు, సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు తిరిగి రావడంతో పార్టీశ్రేణుల్లో ఒక్కసారిగా నూతనోత్సాహం వచ్చింది. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేస్తామని ఐక్యతా రాగం వినిపిస్తున్నారు.

రాహుల్ రోడ్‌షోకు ఏర్పాట్లు

ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం షాద్‌నగర్‌కు రానున్నారు. ఈ మేరకు రాహుల్ పర్యటనను పార్టీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పట్టణంలోని బైపాస్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా చౌరస్తా వరకు భారీ రోడ్ షో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. వివిధ మండలాల నుంచి భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు జన సమీకరణ చేసేందుకు చర్యలు చేపట్టారు.

ముచ్చటగా మూడోసారి..

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికారాబాద్ జిల్లా తాండూరులో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్‌గాంధీ షాద్‌నగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లారు. స్థానిక చౌరస్తాలో తన వాహనాన్ని కొద్ది సేపు ఆపి అభిమానులను పలకరించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నిర్వహించిన భారత్ జోడో పాదయాత్రలో భాగంగా గత సంవత్సరం అక్టోబర్ 30న రాహుల్ షాద్‌నగర్‌కు విచ్చేశారు. బహిరంగ సభలో పాల్గొని ఇక్కడే బస చేశారు. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి కాలుపెట్టనున్నారు.

జల్సాల కోసం అక్రమమార్గం

గంజాయితో పట్టుబడ్డ ముగ్గురు బీటెక్ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: గంజాయిని తరలిస్తూ ముగ్గురు బీటెక్ విద్యార్థులు పట్టుబడిన సంఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మైబెల్లి కథనం ప్రకారం శ్రీ ఇందు కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న బీఎన్‌రెడ్డికి చెందిన కందుల వంశీ (21), సిద్ధార్థ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం దామరకు చెందిన కోనేటి ధనుష్ (21), గురునానక్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విశాఖపట్నం జిల్లా రామవరం మండలం సర్వసిద్ధి గ్రామానికి చెందిన చెల్లపల్లి బాబీ (21) ఇబ్రహీంపట్నంలో ఒకే హాస్టల్‌లో ఉంటూ స్నేహితులయ్యారు. మద్యం, సిగరెట్లు, జల్సాలకు అలవాటుపడిన వారు డబ్బులు సరిపోకపోవడంతో సులభమార్గంలో సంపాదించేందుకు అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారు. నల్లగొండ జిల్లా నాంపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి తెస్తున్నారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌ను ఆపకుండా వెళ్తున్న వీరిని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 1.5 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



కొత్త జైపాల్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

మొయినాబాద్‌రూరల్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన కొత్త జైపాల్‌రెడ్డిని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. నూతనంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించబడిన కొత్త జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తన శాయశక్తులా అందరితో కలిసి పని చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల నేత షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఏక్తా పార్టీ మహేశ్వరం అభ్యర్థిగా సందీప్ గౌడ్



పహాడీషరీఫ్: ప్రజా ఏక్తా పార్టీ మహేశ్వరం నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన ఈరంకి సందీప్ గౌడ్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ చేతుల మీదుగా బీఫాం అందుకున్నారు. నవంబర్ 3న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని బడుగు బలహీన వర్గాల ప్రజల ఓట్లతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేషనల్ కో–ఆర్డినేటర్ సానెం రాజు గౌడ్, నాయకులు శివ, రాఘవేందర్ గౌడ్ పాల్గొన్నారు.

అవినీతి బీఆర్‌ఎస్‌ను గద్దె దింపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: అవినీతి బీఆర్‌ఎస్‌ను గద్దె దింపుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎ.అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాభివృద్ధి కోసమే పీఎం మోదీ పని చేస్తున్నారని అన్నారు. రైతులు, పేద ప్రజల కోసం నిరంతరం బీజేపీ పని చేస్తుందన్నారు. 30 రోజులు కష్టపడి పని చేసి కాషాయ జెండా ఎగురవేసి రాష్ట్రాన్ని కాపాడుకుందామన్నారు. మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగిరేలా ఎమ్మెల్యేగా అందెల శ్రీరాములును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. అందెల శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ.. ఫార్మాతో ఈ ప్రాంతం పది కిలోమీటర్ల వరకు కాలుష్యకారకంగా మారుతుందని, తాము అధికారంలోకి వస్తే ఫార్మాను రాకుండా అడ్డుకునే బాధ్యత తీసుకుంటామన్నారు. డిసెంబ్ 3న కాషాయ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా నాయకుడు బస్వ పాపయ్యగౌడ్, ఎంపీపీ మంద జ్యోతి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి టి.లక్ష్మణ్, సర్పంచులు సాధ మల్లారెడ్డి, ప్రభాకర్, ఎంపీటీసీలు ఎస్.ఎల్లారెడ్డి, బక్క మల్లేష్, బాల్‌రాజ్, డైరెక్టర్ పర్వతాలు, జిల్లా నాయకులు జగదీశ్వర్ రెడ్డి, ఎ.సత్తయ్య, అమరేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, జంగారెడ్డి, పాండు, ఎన్.అంజిరెడ్డి, మహేందర్, రాజేందర్‌రెడ్డి, బాబుగౌడ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డ.. ఉద్దండుల అడ్డా

నగరానికి కూత వేటు దూరంలో ఉన్న నియోజకవర్గం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల కలబోతగా ఉండే ఈ సెగ్మెంట్ రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. పటోళ్ల, పట్నం కుటుంబాలు ఐదు మండలాలను కంచుకోటగా మార్చుకున్నాయి. చేవెళ్ల గడ్డ.. రాజకీయ నేతలకు అడ్డాగా ప్రత్యేకత చాటుకుంటోంది. ఇక్కడ గెలిచిన అభ్యర్థులు రాజకీయాల్లో చక్రం తిప్పిన వారే.



విలక్షణ తీర్పు నియోజకవర్గ సొంతం

- ఉమ్మడి రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిని ఇచ్చిన సెగ్మెంట్
- 1959–62 వరకు డిప్యూటీ సీఎంగా కొండా వెంకటరంగారెడ్డి
- గెలిచి నిలిచిన పటోళ్ల కుటుంబం
- ఎక్కువ సార్లు గెలుపొందిన, భారీ మెజార్టీ సాధించిన నేతగా ఇంద్రారెడ్డి రికార్డు
- త్రిముఖ పోటీలో చక్రం తిప్పేదెవరో..?


దిడిగె సత్యనారాయణ


ప్రతాపలింగం


కొండా లక్ష్మారెడ్డి


ఇంద్రారెడ్డి


సబితారెడ్డి

చేవెళ్ల/మొయినాబాద్: స్వాతంత్య్రం వచ్చిన తరువాత 1952లో మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. మొదటి ఎన్నికలు నిర్వహించినప్పుడు షాబాద్ పేరుతో నియోజకవర్గం ఉండేది. 1952లో జరిగిన ఎన్నికల్లో కొండా వెంకట రంగారెడ్డి విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో షాబాద్ నియోజకవర్గం ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. అప్పుడు వి.రామారావు, కొండా వెంకట రంగారెడ్డి ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కొండా వెంకట రంగారెడ్డి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత 1962లో చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల కేంద్రంగా ఏర్పాటయింది.

పట్టు సాధించిన 'పటోళ్ల'

అనంతరం 1957లో జరిగిన సాధారణ ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ఒక ఉప ఎన్నికతో కలిపి ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందగా తొమ్మిదిసార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, జనతా, టీఆర్‌ఎస్‌లు ఒక్కోసారి జెండా ఎగురవేశాయి. 1967లో దిడిగె సత్యనారాయణ ఇండిపెండెంట్‌గా విజయం సాధించగా.. దివంగత మంత్రి పటోళ్ల ఇంద్రారెడ్డి అత్యధికంగా నాలుగు సార్లు విజయం సాధించి చరిత్రకెక్కారు. 1985, 1989, 1994లో టీడీపీ నుంచి పోటీ చేసిన ఆయన వరుసగా 24,713, 47,289, 20,384 ఓట్ల మెజార్టీ సాధించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం జై తెలంగాణ పార్టీని స్థాపించారు. రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ సుముఖత వ్యక్తం చేయడంతో ఆయన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. 1999లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆయన ప్రత్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్‌ఆర్)పై 63,299 భారీ మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ రికార్డు ఆయనకే దక్కింది. ఆ తరువాత రెండు పర్యాయాలు వి.రామారావు, రెండుసార్లు మాజీ హోంమంత్రి పి.సబితారెడ్డి, రెండు సార్లు కాలె యాదయ్య నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఎమ్మెల్యేగా ఉన్న ఇంద్రారెడ్డి 2000 ఏప్రిల్ 22న పాల్మాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో మొదటిసారి ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో సబితారెడ్డి ఆయన వారసురాలిగా అరంగేట్రంచేసి భారీ మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం 2004 ఎన్నికలోనూ సబితారెడ్డి హస్తం గుర్తుపై పోటీ చేసిన ఆమె టీడీపీ అభ్యర్థి సామ భూపాల్‌రెడ్డిపై 41,585 ఓట్ల మెజార్టీతో రెండో సారి గెలుపొందారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం ఓటర్లు
నవాబుపేట	18,192	17,686	0	35,878
శంకర్‌పల్లి	31,065	30,987	0	62,052
మొయినాబాద్	28,520	27,124	01	55,645
షాబాద్	22,915	22,113	01	45,029
చేవెళ్ల	28,081	27,285	02	55,368
మొత్తం	1,28,773	1,25,195	04	2,53,972



త్రిముఖ పోటీ

2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మరో మారు కాలె యాదయ్యకు అవకాశం కల్పించింది. కాంగ్రెస్ ప్రకటించిన లిస్టులో భీంభరత్‌కు అవకాశం దక్కింది. ఇటీవలే కమలం గూటికి చేరిన కేఎస్ రత్నంకే బీజేపీ టికెట్ వస్తుందని ప్రచారం సాగుతోంది. వీరు ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1952	కొండా వెంకట రంగారెడ్డి	స్వతంత్ర
1957	వి.రామారావు	కాంగ్రెస్
ద్విసభ్య	కొండా వెంకట రంగారెడ్డి	కాంగ్రెస్
1962	వి.రామారావు	కాంగ్రెస్
1967	డి.సత్యనారాయణ	స్వతంత్ర
1972	పి.కిషన్‌రావు	కాంగ్రెస్
1978	సి.ప్రతాప్‌లింగం	జనతా
1983	కె.లక్ష్మారెడ్డి	కాంగ్రెస్
1985	పి.ఇంద్రారెడ్డి	టీడీపీ
1989	పి.ఇంద్రారెడ్డి	టీడీపీ
1994	పి.ఇంద్రారెడ్డి	టీడీపీ
1999	పి.ఇంద్రారెడ్డి	కాంగ్రెస్
2000 (ఉప ఎన్నిక)	పి.సబితారెడ్డి	కాంగ్రెస్
2004	పి.సబితారెడ్డి	కాంగ్రెస్
2009	కేఎస్.రత్నం	టీడీపీ
2014	కాలె యాదయ్య	కాంగ్రెస్
2018	కాలె యాదయ్య	టీఆర్‌ఎస్

2009 నుంచి ఎస్సీ రిజర్వ్

చేవెళ్ల నియోజకవర్గం 2009 ముందు జనరల్ స్థానంగా ఉండేది. అప్పట్లో ఈ నియోజకవర్గం పరిధిలో చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, శంషాబాద్, రాజేంద్రనగర్, ప్రస్తుత గండిపేట మండలం ప్రాంతాలు ఉండేవి. 2009 ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. డీలిమిటేషన్‌లో భాగంగా చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, నవాబ్‌పేట మండలాలను కలిపి చేవెళ్ల నియోజకవర్గంగా ఏర్పాటు చేసి ఎస్సీ రిజర్వేషన్ కల్పించారు. 2009లో టీడీపీ నుంచి కేఎస్ రత్నం, కాంగ్రెస్ నుంచి కాలె యాదయ్య పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో రత్నం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన ఎన్నికల్లో కేఎస్ రత్నం టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాలె యాదయ్య విజయం సాధించారు. అనంతరం ఆయన గులాబీ గూటికి చేరి టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కేఎస్ రత్నం ఓటమి పాలయ్యారు.


బాబా ఆశీస్సులకు 'అభ్యర్థి'త్వం


బాబా దర్శనానికి వచ్చిన మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి (ఫైల్)

బాబా షర్ఫుద్దీన్ దర్గా వద్ద సాధారణ రోజుల్లోనే నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక ఎన్నికల వేల నేతల తాకిడి మొదలవుతుంది. పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు వస్తే రాజకీయ నాయకులతో దర్గా పరిసరాలు కిటకిటలాడుతాయి. మహేశ్వరం నియోజకవర్గంలో పేరుగడించిన దర్గా కావడంతో 2018 ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సబితారెడ్డి, బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన అందెల శ్రీరాములు యాదవ్ తలపై బుట్టనెత్తుకుని బాబాకు పూలు, ఛాదర్ సమర్పించారు. - పహాడీషరీఫ్


బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్(ఫైల్)

చూస్తోంది.. షాడో రిజిస్టర్




బంజారాహిల్స్: అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలన చేస్తున్న అధికారులు ఆయా ఖర్చులను నియోజకవర్గాల వారీగా షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. ఈ లెక్కల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని గణించనున్నట్లు వ్యయ నియంత్రణ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో తాము ఖర్చు చేసే డబ్బులను ఎవరు చూస్తున్నారులే అని నిర్లక్ష్యంగా వ్యవహరించే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. షాడో రిజిస్టర్ నిర్వహణ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన అకౌంటింగ్ బృందాలు ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పరిశీలన చేయాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. ఒకప్పుడు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 15 రోజులకోసారి సమర్పించే రికార్డులను పరిశీలకులు తనిఖీ చేసేవారు. ఇందుకు భిన్నంగా ప్రస్తుతం షాడో రిజిస్టర్ లెక్కలతో అభ్యర్థి వ్యయాన్ని సరి చూసుకోనున్నారు. దీంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రతీ పైసాకు లెక్కలు చూపాల్సిన అవసరం ఏర్పడింది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచే వ్యయం అంతా ఆయా రాజకీయ పార్టీల పరిధిలోకి రానుంది. అభ్యర్థుల ప్రకటన అనంతరం ప్రచారంతో పాటు ఇతర ఖర్చుల మొత్తం అభ్యర్థుల ఖర్చుల్లోకి వెళ్లనున్నాయి. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు.

వలసలకు బ్రేక్


అసంతృప్తులతో మంత్రి మంతనాలు సఫలం

తాండూరు రూరల్: అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ బడా నాయకుడితో మంత్రి చేపట్టిన చర్చలు సఫలమయ్యాయి. మంగళవారం కొడంగల్‌లో ఎన్నికల ప్రచారానికి హాజరైన పట్నం మహేందర్‌రెడ్డి రాత్రికి తాండూరుకు చేరుకున్నారు. తన ప్రత్యేక వాహనంలో పార్టీ మారే యోచనలో ఉన్న నేత ఇంటికి వెళ్లి బుజ్జగించారు. పైలట్ గెలుపునకు పనిచేయాలని సూచించడంతో ఆయన మెత్తబడ్డారు. తన అనుచరులకు సైతం రోహిత్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చినట్లు సమాచారం. దీంతో గులాబీ నేతలు తాండూరు నుంచి వలసలకు బ్రేక్ పడినట్టేనని చర్చించుకుంటున్నారు.

షాద్‌నగర్‌కు నలుగురు ప్రధానులు


నెహ్రూ


పీవీ నర్సింహారావు


మొరార్జీ దేశాయ్


ఇందిరా గాంధీ

పీఎం హోదాలో ప్రచారానికి విచ్చేసిన ఇందిరాగాంధీ, మొరార్జీ దేశాయ్

షాద్‌నగర్: భారత దేశ ప్రధానులు షాద్‌నగర్‌ను సందర్శించారు. 1959 నుంచి 1978 వరకు దేశాన్ని పాలించిన నలుగురు ప్రధానమంత్రులు ఇక్కడకు విచ్చేశారు. 1959లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి హోదాలో మొట్టమొదటిసారిగా రాగా.. అనంతరం ఇందిరా గాంధీ 1983లో ప్రధాని హోదాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అదేవిధంగా పీవీ నర్సింహారావు మూడుసార్లు సందర్శించగా ప్రధాని హోదాలో షాద్‌నగర్ మీదుగా కర్ణాటకకు రైల్లో వెలుతూ స్టేషన్‌లో దిగి కాసేపు కార్యకర్తలు, నేతలకు అభివాదం చేసి వెళ్లారు. 1978లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మొరార్జీ దేశాయ్ ప్రధానిమంత్రిగా విచ్చేశారు.

తలసాని హ్యాట్రిక్ కొట్టేనా?



సనత్‌నగర్: నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థీ ఇంతవరకు హ్యాట్రిక్ రికార్డును కై వసం చేసుకున్న చరిత్ర లేదు. మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచినప్పటికీ వరుసగా ఆ విజయాలను నమోదు చేసుకున్న పరిస్థితులు ఉత్పన్నం కాలేదు. 1978లో సనత్‌నగర్ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటివరకు మొత్తం 11 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1992, 1994లో వరుసగా రెండుసార్లు ఇక్కడి నుంచి మర్రి శశిధర్‌రెడ్డి గెలుపొందగా 1999 ఎన్నికల్లో శ్రీపతిరాజేశ్వర్ గెలుపొందడంతో శశిధర్‌రెడ్డికి హ్యాట్రిక్ దూరమైంది. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో సైతం మర్రి శశిధర్‌రెడ్డి రెండుసార్లు వరుస విజయాలను నమోదు చేసుకోగా 2014లో ఆయన పరాజయం పాలవడంతో మరోసారి హ్యాట్రిక్ మిస్ అయ్యింది. ఇక 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్ గెలుపొంది మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు.